క్లుప్తంగా

సబ్సిడీ వేరుశనగ విత్తనం కేటాయింపు

తుగ్గలి : ఖరీఫ్‌లో రైతులకు పంపిణీ చేసేందుకు మండలానికి 2,600 క్వింటాళ్ల వేరుశనగ కాయలు, 30 క్వింటాళ్ల కందులు కేటాయించినట్లు వ్యవసాయశాఖ మండల అధికారి పవన్ కుమార్ గురువారం తెలిపారు. విత్తన వేరుశనగపై 40శాతం రాయితీ వర్తింపజేశారన్నారు. కే–6రకం క్వింటా పూర్తి ధర రూ.9,300 కాగా, అందులో రూ.3,720 రాయితీ వర్తిస్తుందన్నారు. మిగతా రూ.5,580 రైతులు చెల్లించాలన్నారు. అనుమతులు రాగానే రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తామని చెప్పారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌పై ఉచిత శిక్షణ

ఎమ్మిగనూరుటౌన్: ఐఆర్ఎస్ అధికారి యాదగిరి, అమీలియో ఆసుపత్రి అధినేత లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో పినాక సంస్థ వారు జిల్లా కేంద్రం కర్నూలులోని సాయి సుబ్బయ్య రవీంద్ర స్కూల్‌లో ఈనెల 15వ తేదీ నుంచి స్పోకెన్ ఇంగ్లిష్‌పై ఉచిత శిక్షణ ఇస్తారని ఆర్‌పీవీఎఫ్ స్థానిక నాయకుడు ఖాజ గురువారం తెలిపారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగ అన్వేషణలో ఉన్న నిరుద్యోగులు, విద్యార్థులకు శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. 21రోజుల పాటు నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 9177764147, 6301095744 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మద్దికెర ఎస్‌ఐగా మహమ్మద్ రిజ్వాన్



మద్దికెర : ఎస్‌ఐగా మహమ్మద్ రిజ్వాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న నాగేంద్ర ప్రసాద్ మహానందికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొలిమిగుండ్ల మండలంలోని రేవనూరు పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

247 గృహాలు మంజూరు

మద్దికెర : మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద 247 ఇళ్లు మంజూరయ్యాయని హౌసింగ్ ఏఈ ఉమకాంత్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో 798 ఇళ్లు మంజూరు కాగా నిర్మాణ దశలో ఉన్నాయని, దశల వారీగా బిల్లులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఇళ్లు మంజూరైన వారు తహసీల్దార్ కార్యాలయంలో పొజిషన్ సర్టిఫికెట్లు అందజేయాలని సూచించారు.

ఎల్లార్తి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు



దర్గాలో ఫాతెహాలు నిర్వహిస్తున్న భక్తులు

హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల్లో గురువారం భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో దర్గా పరిసరాల్లో నిండిపోయాయి. పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాల్లో, షిరిడి సాయిబాబా ఆలయానికి భక్తులు తరలివచ్చి మొక్కులను తీర్చుకున్నారు.

నేడు విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ

కృష్ణగిరి: మండలంలోని తాపలకొత్తూరు గ్రామంలో దాదాపు రూ.కోటి చందాలతో నూతనంగా నిర్మించిన శివాలయంలో కాశీ విశాలక్ష్మి, విశ్వేశ్వరస్వామి, నంది సహిత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలు, ధ్వజ స్తంభం, కలశ ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం నూతన విగ్రహాలకు జలాధివాసం నిర్వహించి గ్రామంలో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో పురోహితులు హోమాలు చేపట్టారు. శుక్రవారం ఉదయం దేవతామూర్తుల విగ్రహాలు, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ అనంతరం శివపార్వతుల కల్యాణం జరిపిస్తామని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామని చెప్పారు.

బాధ్యతగా పనిచేయాలి



హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

హొళగుంద: సచివాలయ ఉద్యోగులు,వలంటీర్లు బాధ్యతగా పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ దాసానాయక్ సూచించారు. గురువారం స్థానిక 1, 2 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పథకాల అమలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పనితీరు, హాజరు శాతం తదితర వాటిని పరిశీలించారు. సంక్షేమ పథకాలను ప్రజల దరికి చేర్చాలని చెప్పారు.

మంత్రాలయంలో భక్తుల రద్దీ

మంత్రాలయం రూరల్: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. బెంగళూరు, చెన్నై, ముంబాయి తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గ్రామదేవత మంచాలమ్మ, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు.

బాల్య వివాహం.. భవితకు శాపం

బాల్య వివాహాలు బాలికల భవితకు శాపంగా మారుతున్నాయి. బడికెళ్లాల్సిన వయస్సులో పెళ్లి పీటలెక్కుతున్నారు. పుస్తకాలు పట్టాల్సిన అమ్మాయిలు పుస్తెల దండతో అత్తారింటికెళ్తున్నారు. పట్టుమని 15 ఏళ్లు నిండకుండానే భార్యగా, తల్లిగా బాధ్యతలు మోస్తున్నారు. ఒకవైపు పేదరికం.. ఆడపిల్ల భారం తీరుతుందని కన్న వాళ్లే సంసారం అనే సాగరంలోకి నెట్టేస్తున్నారు.

- బడికి వెళ్లాల్సిన వయసులో.. కుటుంబ బాధ్యత
- బాల్య వివాహాల నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్ల వయస్సు తప్పనిసరి
- పెళ్లిళ్లకు రిజిస్ట్రేషన్ చేయించాలంటున్న అధికారులు

ఆలూరు రూరల్: నిరక్షరాస్యత..పేదరికం..బాలికలను చదివించే స్థోమత లేకపోవడం..మంచి సంబంధం వచ్చిందనే కారణాలతో గ్రామాల్లో బాల్యవివాహాలు జరిగిపోతున్నాయి. బాల్య వివాహం నేరం. వాటి వల్ల అమ్మాయిలకు ఎన్నో నష్టాలున్నాయని, వారిని బాగా చదివించి ప్రయోజకులను చేయాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నా.. కొందరు తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదు. దీంతో చిన్న వయస్సులో బాలికలను సంసారమనే సాగరంలో ముంచేస్తున్నారు. పరిస్థితుల్లో మార్పు తెచ్చేందుకు అధికార యంత్రాంగం కృషి చేస్తోంది.

సమాజం మారుతున్నా..

టెక్నాలజీ రోజురోజుకు మారుతున్నా, సమాజం నూతన పోకడలు పులుముకుంటున్నా బాల్య వివాహాల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. పెళ్లంటే ఏమిటో తెలియని వయస్సులో బాలికలను అత్తారింటికి పంపి, వారి బంగారు భవిష్యత్‌కు తల్లిదండ్రులే సంకెళ్లు వేస్తున్నారు. మరికొందరు ఆడపిల్లలను భారంగా భావించి వదిలించుకునేందుకు పెళ్లి పీటలు ఎక్కిస్తున్నారు. దీంతో బాలికలు మానసికంగా,శారీరకంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నా.. బాల్య వివాహాలు ఆగడం లేదు.

ఇలా అడ్డుకోవచ్చు..

గ్రామ స్థాయిలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని సూపర్‌వైజర్, సీడీపీఓ, మండల స్థాయిలో తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్డీఓలు బాల్యవివాహాలను అడ్డుకునే అధికారం ఉంది. ఐసీడీఎస్ సిబ్బంది తప్పా ఇతర శాఖల అధికారులు దీనిపై దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఎవరైనా 1098కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. ఇప్పటికే సమగ్ర బాలల పరిరక్షణ పథకం కింద ఐసీడీఎస్ ప్రాజెక్టు స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు మండల సమాఖ్య, సంరక్షణ అధికారుల సమన్వయంతో 18 ఏళ్లు నిండకుండా పెళ్లిళ్లు చేయకూడదని అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది నుంచి గ్రామ,వార్డు సచివాలయ పరిధిలో ఉన్న క్షేత్ర స్థాయి సిబ్బందికి బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సూచనలు ఇస్తున్నారు. ఆలూరు ఐసీడీసీ ప్రాజెక్టు పరిధిలోని 5 మండలాల్లో నాలుగేళ్ల నుంచి ఇప్పటి వరకు కేవలం 17 బాల్య వివాహాలను మాత్రమే అడ్డుకున్నామని, మిగిలినవి వెలుగులోకి రావడం లేదని అధికారులు వెల్లడించారు.

వివాహ రిజిస్ట్రేషన్ తప్పనిసరి..

బాల్యవివాహాల నిరోధానికి అధికారులు ప్రత్యేక ప్రణాళిక చేపట్టారు. జిల్లాలోని అన్ని, రెవెన్యూ డివిజన్, ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సీడీపీఓలు వివాహ రిజిస్ట్రేషన్ చట్టం 2002 అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ,వార్డు స్థాయిలో మహిళా సంరక్షణ కార్యదర్శుల ద్వారా వివాహ రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం తప్పనిసరి చేశారు. సంతకం చేసిన దరఖాస్తు ఫారం, నివాస ధ్రువ పత్రం, వయస్సు, ఆధార్ కార్డు, వధువు, వరుడుకు చెందిన రెండు ఫొటోలు, వివాహ పత్రికతో సంబంధిత రిజిస్ట్రేషన్ ఆఫీసులో దరఖాస్తు చేసుకోవాలి. తప్పడు పత్రాలు సమర్పిస్తే జైలు శిక్షతో పాటు జరిమానా విధించాలని నిబంధనలు పేర్కొంటున్నాయి.

అధికారులు అడ్డుకున్న వివాహాల్లో కొన్ని..

- 2021 జూన్ 22న ఆలూరు మండలంలోని హత్తిబెళగల్ గ్రామంలో గుట్టుగా బాల్యవివాహం జరుపుతున్నారని తెలుసుకున్న అధికారులు పెళ్లిని అడ్డుకున్నారు.ఆధార్‌కార్డులో అమ్మాయి వయసు 16 ఏళ్లు ఉండడంతో 18 ఏళ్లు పూర్తయిన తర్వాతనే వివాహం చేయాలని అమ్మాయి తల్లిదండ్రుల నుంచి రాతపూర్వకంగా హామీ తీసుకున్నారు. వివాహం చేసినట్లు నిర్ధారణ అయితే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.
- 2022 ఫిబ్రవరి 8న హొళగుంద మండలంలోని పెద్దగోనేహాల్ గ్రామంలో బాల్యవివాహం చేస్తున్నారనే సమాచారం మేరకు ఐసీడీఎస్ అధికారులు వివాహాన్ని నిలిపివేశారు. అమ్మాయి మైనర్ తీరే వరకు పెళ్లి చేయమని తల్లిదండ్రుల నుంచి హామీ పత్రం తీసుకున్నారు. పేదరికం.. అమ్మాయిని చదివించలేక.. మంచి సంబంధ రావడంతో పెళ్లి చేస్తున్నట్లు తల్లిదండ్రులు వాపోయారు.
- ఈ ఏడాది ఫిబ్రవరి 14న కురుకుంద గ్రామంలో 14 ఏళ్ల అమ్మాయికి వివాహం చేస్తున్నారని తెలియడంతో ఐసీడీఎస్ అధికారులు గ్రామానికి వెళ్లి వివాహాన్ని అడ్డుకున్నారు. అమ్మాయికి మైనర్ తీరిన తర్వాత వివాహం చేస్తామని తల్లిదండ్రులు రాతపూర్వకంగా అధికారులకు హామీ ఇచ్చారు.



2019 నుంచి నియోజకవర్గంలో అడ్డుకున్న బాల్య వివాహాలు

ఏడాది	బాల్య వివాహాలను ఆపిన సంఖ్య
2019	4
2020	5
2021	2
2022	2
2023	3

బాల్య వివాహాలతో అనర్థాలు..

- బాలికల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది.
- 18ఏళ్ల తర్వాత బాలికల శారీరక, మానసిక ఎదుగుదల ఉండదు.
- చిన్న వయసులో గర్భం దాల్చే బాలికల్లో గర్భస్రావం ఎక్కువ.
- శిశు మరణాలతో పాటు తల్లుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది.
- పుట్టబో బిడ్డ తక్కువ బరువుతో ఉంటారు. భవిష్యత్‌లో అనారోగ్య సమస్యలు వస్తాయి.
- 60 శాతం బాలికల్లో రక్తహీనత ఉంటుంది. ఈ క్రమంలో గర్భం దాల్చడం మంచిది కాదు.

విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం



బాల్య వివాహాలను అడ్డుకుంటున్నాం. పోలీసు, రెవెన్యూ, చైల్డ్‌లైన్ 1098 ద్వారా నిరోధిస్తున్నాం. బాల్య వివాహాల కారణంగా జరిగే నష్టాలను వివరిస్తున్నాం. బాలికల ఆరోగ్యం, వారి భవిష్యత్ గురించి తెలియజేస్తున్నాం. అన్ని కోణాల్లో నిరోధించడానికి శ్రమిస్తున్నాం. క్షేత్రస్థాయిలో బాల్య వివాహాల నిర్మూలనపై సచివాలయాల మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలు ఇచ్చాం.

– సావిత్రి దేవి,సీడీపీఓ,ఆలూరు.

రక్తహీనతతో ప్రాణాలకు ముప్పు



చిన్న వయస్సులో బాలికలకు వివాహాలు చేయడంతో రక్తహీనతతో ప్రాణాలకు ముప్పు కలగుతుంది. చిన్నతనంలో గర్భందాల్చడం, గర్భస్రావం కావడంతో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. అలాగే చిన్నతనంలోనే ఒకటి లేదా రెండు ప్రసవాలు జరిగితే పుట్టిన బిడ్డ, తల్లికి మానసిక,శారీరక ఎదుగుదల ఉండదు. 18 ఏళ్లలోపు గర్భం దాల్చడం మంచిది కాదు.

– లక్ష్మీనారాయణ , చిన్నపిల్లల వైద్యులు,ఆలూరు

పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించండి

ఆలూరు: సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పార్టీ కార్యకర్తలకు సూచించారు. గురువారం దేవనకొండ మండలంలోని బుర్రకుంట గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన పథకాల ప్రయోజనాల గురించి పార్టీ కార్యకర్తలు, గృహసారథులు ఇంటింటికీ తిరిగి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం సీఎం వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలపై టీడీపీ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని, సంక్షేమం, అభివృద్ధి తమ ప్రభుత్వానికి రెండు కళ్లు అన్ని అన్నారు. అనంతరం గ్రామ నాయకులు బి.శ్రీనివాసులు, ఈశ్వరయ్య ఇళ్లల్లో జరిగిన కార్యక్రమాలకు హాజరయ్యారు. మాళమల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ రామకృష్ణ పాల్గొన్నారు.

ఆ పాఠశాలపై చర్యలు తీసుకోండి



ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్ : పేద విద్యార్థులకు సీట్లు కేటాయించడంలో వివక్ష చూపుతూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్న పట్టణంలో మాచాని ఇంగ్లిష్ మీడియం ఎయిడెడ్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు అజిత్ కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి, సమస్యను ఎమ్మెల్యే దృష్టికి సమస్య తీసుకెళ్లాలని కోరారు. నిస్వార్థ సేవలందించిన పద్మశ్రీ మాచాని సోమప్ప స్థాపించిన పాఠశాలలో ఇలా పేద విద్యార్థులకు సీట్లు కేటాయించకపోవడం దారుణమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నిత్యానందరాజు

నందవరం : స్పందన అర్జీలకు సత్వర పరిష్కరం చూపుతున్నామని తహసీల్దార్ నిత్యానందరాజు పేర్కొన్నారు. గురువారం మండలంలోని చిన్నకొత్తిలి గ్రామ రైతు దేవనంద్ భార్య సి.శాంతి తమ పొలానికి హద్దులు చూపాలని స్పందనలో అర్జీ అందజేయడంతో క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యను పరిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. సి.శాంతి భర్తకు పెద్దకొత్తిలి గ్రామంలో సర్వే నంబరు 182–ఎఫ్2 బీలో గతంలో ల్యాండ్ సీలింగ్ భూమి 1.05 ఎకరాలకు పట్టా ఇచ్చారని చెప్పారు. అయితే పదేళ్లుగా వారు పొలంలో లేకపోవడంతో పక్కన ఉన్న రైతులు సాగు చేసుకున్నారని తెలిపారు. స్పందన ద్వారా గురువారం భూమిని సర్వే చేయించి హద్దులు చూపించామని స్పష్టం చేశారు. సమస్యను పరిష్కరించడంతో మహిళా రైతు సంతోషం వ్యక్తం చేసింది. వీఆర్వో రమేష్, సర్వేయర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పండ్ల మొక్కల సాగుకు దరఖాస్తు చేసుకోండి

తుగ్గలి : పండ్ల మొక్కల సాగుకు రెండు రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ రామకృష్ణ గురువారం తెలిపారు. 5 ఎకరాల్లోపు భూములున్న రైతులు ఇందుకు అర్హులన్నారు. మండలంలో ఈ ఏడాది 500 ఎకరాల్లో పండ్ల మొక్కల సాగు చేయాలని లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 300 ఎకరాల్లో మొక్కలు పెంచు కునేందుకు రైతులు దరఖాస్తులు అందజేశారన్నారు. ఆసక్తి ఉన్న రైతులు రెండు రోజుల్లోగా తమ ధ్రువపత్రాలను ఫీల్డ్‌అసిస్టెంట్లకు అందజేయాలని సూచించారు. వచ్చే నెల మొదటి వారం నుంచి రైతుల పొలాల్లో పండ్ల మొక్కల పెంపకం పనులను ప్రారంభిస్తామని చెప్పారు.

గోనెగండ్ల: పండ్ల మొక్కల సాగుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఉపాధి హామీ పథకం ఈసీ ఉస్మాన్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం మండలంలోని పెద్దనేలటూర్, బి.అగ్రహారం, గోనెగండ్ల, కులుమాల, లింగందిన్నె, నెరుడుప్పల, పుట్టపాశం, గాజులదిన్నె, హెచ్. కైరవాడి గ్రామాల్లోని రైతులకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధి హామీ సిబ్బంది పండ్ల తోటల సాగుపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా సబ్సిడీతో జామ, మామిడి, కొబ్బరి, సపోట, నిమ్మ, బత్తాయి, నేరేడు, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, మల్లెలు, మునగ మొక్కలను పంపిణీ చేయడంతో పాటు మొక్కల పెంపకానికి ఎరువులను కూడా ప్రభుత్వామే రాయితీతో అందజేస్తుందన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి

మద్దికెర : సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేసి, అర్హులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉందని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అనిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. జల్‌జీవన్ మిషన్ కింద మండలంలోని 11 గ్రామాల్లో రూ.6.54 కోట్లతో టెండర్లు పిలిచామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ తెలిపారు. వేరుశనగ విత్తనాలకు రైతులు ఆర్బీకేల్లో నమోదు చేసుకోవాలని ఏఓ హేమలత తెలిపారు. ఎడవలి, పెరవలి గ్రామాల్లోని చెరువుల అభివృద్ధికి రూ. 20 లక్షలతో ప్రతిపాదనలు పంపామని ఇరిగేషన్ శాఖ డీఈ చంద్రశేఖర్ చెప్పారు.జెడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామాల్లో చాలా మంది వలంటీర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని, అలాంటి వారిని తొలగించాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ నరసింహమూర్తి, సర్పంచులు సుహాసిని, మల్లికార్జున, ఆంజనేయులు, వైద్యాధికారి నగేష్, పశు వైద్యాధికారి కృష్ణానాయక్, ఏపీఓ రవీంద్రనాథ్, ఏపీఎం సూర్యప్రకాష్, ఈఓలు సంజప్ప, సుధాకర్, రాధ, కరుణకుమారి, ఎంపీటీసీలు రామకృష్ణారెడ్డి, వేణమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



ఎస్‌ఐ తిమ్మారెడ్డికి ఫిర్యాదు అందజేస్తున్న దృశ్యం

గోనెగండ్ల: మండలంలోని బి. అగ్రహారం గ్రామంలో దళితుల శ్మశాన స్థలం కంచె తొలగించి, అక్కడ ఏర్పాటు చేసిన అంబేడ్కర్ చిత్రపటంపై బురద వేసి వారిపై కేసు నమోదు చేయాలని మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు రంగయ్య, జిల్లా కార్యదర్శి మల్లేష్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. గ్రామంలో దళితుల శ్మశానం స్థలం చుట్టూ ఏర్పాటు చేసిన కంచెను తొలగించి, అంబేద్కర్‌ను అవమానించారని గ్రామస్తులు గురువారం ఉదయం ఎమ్మిగనూరు, ఆదోని ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. వీరికి మాల మహానాడు, కేవీపీఎస్ నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం కంచె తొలగించిన వారి ఇంటిని ముట్టడించి ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు గ్రామానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి సమస్య సద్దుమనిగేలా చేశారు. సాయంత్రం సంఘాల నాయకులతో కలిసి గ్రామస్తులు గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ తిమ్మారెడ్డికి ఫిర్యాదు చేశారు.

కేసు నమోదు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలోని కలుగొట్ల గ్రామానికి చెందిన అన్నదమ్ముల మధ్య పొలం తగాదాలో బుధవారం అన్నపై తమ్ముడు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో గాయపడిన శ్రీనివాసులు కర్నూలులో చికిత్స పొంది గురువారం గ్రామానికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశాడు. దీంతో చంద్రశేఖర్, అతని భార్య వెంకటేశ్వరమ్మ, బోయ మునిస్వామిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మంత్రాలయం: మండలంలోని లచ్చమర్రి ఏపీ మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరం సంబంధించి 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. www.cre.a p.gov.in /httpr://apmr.ap.gov.inఅనే వైబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2011 సెప్టెంబర్–1 నుంచి 2013 ఆగస్టు–31 మధ్యలో జన్మించిన ఓసీ, బీసీ విద్యార్థులు, 2009 సెప్టెంబర్–1 నుంచి 2013 ఆగస్టు–31 మధ్యలో జన్మించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అర్హులన్నారు. మండలంలో ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2022–23 విద్యా సంత్సవరంలో 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు రుసుం ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ. 75 చెల్లించాలన్నారు. ప్రవేశ పరీక్ష జూన్ 11న స్థానిక మోడల్ స్కూల్‌లో ఉదయం 11 గంటలకు ఉంటుందని తెలిపారు.

14న లాసెట్ మోడల్ పరీక్ష

కర్నూలు(లీగల్): ఏపీ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన ఉచితంగా మోడల్ లాసెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శీనయ్య సాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.నాగరాజు యాదవ్ తెలిపారు. కర్నూలులో ఎన్ఆర్ పేటలోని శ్రీలక్ష్మీ హైస్కూల్లో ఉదయం 10గంటల నుంచి 11:30 గంటల వరకు మోడల్ పరీక్ష ఉంటుందని వెల్లడించారు. వివరాలకు ఎం.వి.చక్రపాణి – 94413 00262, వి.శ్రీరాములు – 70133 72238 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

లోకోస్ యాప్‌పై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం దాసన్న

కృష్ణగిరి: పొదుపు సంఘాలు, సభ్యుల లావాదేవీలను ఇక నుంచి లోకోస్ యాప్‌లో నమోదు చేయాలని ఏపీఎం దాసన్న సిబ్బందికి సూచించారు. స్థానిక కార్యాలయంలో గురువారం లోకోస్ యాప్‌పై జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సెర్ప్ సంస్థ 2000లో ప్రారంభం కాగా ఆ తర్వాత 2011లో ఎన్ఆర్ఎల్ఎం కింద అడాప్ చేయబడిందని, అప్పటి వరకు సంఘాల లావాదేవీలు పుస్తకాల రూపంలో నిర్వహించేవారు. 2012లో మొబైల్ ద్వారా ఆన్‌లైన్‌లోఎంట్రీ చేయడం ప్రారంభమైందని, ప్రస్తుతం ఈ యాప్ ద్వారా సంఘాలు, సభ్యుల లావాదేవీలన్నీ నమోదు చేయాలని చెప్పారు. సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తిలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గురువారం లోకోస్ యాప్‌పై వీఓఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో మొబైల్ బుక్ కీపింగ్ ఉండేదని, ఆ స్థానంలో లోకోస్ యాప్‌తో కొత్త సాంకేతికతను జోడించారన్నారు. ఈ యాప్‌లో పొదుపు సంఘాల పొదుపు, వడ్డీలు, లోన్లు, నిధులు, సభ్యులు తీసుకున్న సొమ్ము, రికవరీతోపాటు సమగ్ర సమాచారం పొందపరచాలని సూచించారు.

నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణించాలి

కర్నూలు సిటీ: విద్యాశాఖను నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణించాలని కోరుతూ ఫ్యాప్టో నాయకులు గురువారం డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా చైర్మన్ గోకారి, సెక్రటరీ జనరల్ గట్టు తిమ్మప్పలు మాట్లాడుతూ.. వేసవి సెలవులలో ఉపాధ్యాయులకు ఎస్‌సీఈఆర్‌టీ నిర్దేశించిన బాధ్యతలకు సంబంధించి గానీ, వుయ్ లవ్ రీడింగ్ కార్యక్రమాలకు సంబంధించి గానీ, పదవ తరగతి పరీక్షలలో ఫెయిలైన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించేందుకు కేవలం ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలతోనే ఉపాధ్యాయులతో పని చేయిస్తున్నారన్నారు. ఈ విధానాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఇతర శాఖల మాదిరిగానే విద్యాశాఖను నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణించి ఉపాధ్యాయుల చేత నిర్వహించుకునే కార్యక్రమాలకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో నాయకులు జయరాజు, టి.కె జనార్దన్, మారియానందం, సుధాకర్, నాగరాజు, శ్రీధర్, గోవింద్ పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి సూచించారు. ఆయన గురువారం స్థానిక విద్యుత్ భవన్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు మూడు రోజులుగా గాలి, వర్షాలు ఉంటున్నాయని, వీటి వల్ల సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. ముఖ్యంగా గాలికి బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్, ఫీడర్ డౌన్ వంటి సమస్యలు తెలుత్తుతాయని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు.

14న బాలికల క్రికెట్ జట్ల ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని క్రికెట్ నెట్స్‌లో ఈనెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు సీనియర్స్, అండర్–23, అండర్–19, అండర్–15 విభాగంలో జిల్లాస్థాయి బాలికల క్రికెట్ జట్ల ఎంపిక ఉంటుందని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె.దేవేంద్ర గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు సౌత్ జోన్ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. 2008 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారు అర్హులని, ఆసక్తి కలిగిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు.

నేడు నాటక ప్రదర్శన

ఆదోని అర్బన్ : శ్రీలలిత కళాసేవా సంస్థ ఆధ్వర్యంలో మహాయోగి లక్ష్మమ్మవ్వ జాతర సందర్భంగా శుక్రవారం రీక్రియేషన్ క్లబ్‌లో ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేశామని సంస్థ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, నాటక ఆర్గనైజర్స్ డా. నల్లారెడ్డి, కె.తాయన్న, హనుమాన్‌సింగ్, లక్ష్మన్న యాదవ్, డ్రైవర్ రంగన్న తెలిపారు. సాయంత్రం 6 గంటలకు నాటక ప్రదర్శన ప్రారంభమవుతుందని చెప్పారు.

అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసకుమార్

వెల్దుర్తి(కృష్ణగిరి): గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా జరగాలంటే అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసకుమార్ అన్నారు. వెల్దుర్తిలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ఫిర్యాదు చేసిన వారి వివరాలను ఎప్పటికప్పుడు సేకరించాలని, నాడు–నేడు పనులను జూన్ 10 నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే సచివాలయాలు, ఆర్‌బీకేలు, జగనన్న హెల్త్ క్లినిక్‌లు, గృహ నిర్మాణాలు వేగంగా జరిగేలా చూడాలని చెప్పారు. అనంతరం పట్టణంలోని సచివాలయం–3ని తనిఖీ చేశారు. ఎంపీడీఓ శ్రీనివాసకుమార్, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంఈఓ ఇందిర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.